

ముందుకు రాని కాంట్రాక్టర్లు
ఐదు సార్లు తలనీలాల టెండర్లు వాయిదా 7లో..

ఎలాంటి సమస్యలున్నా నేరుగా ఫోన్ చేయాలి 8లో..



ఎరువుల విక్రయాలపై నజర్

- జోరుగా వ్యవసాయ, రెవెన్యూ అధికారుల తనిఖీలు
- ప్రక్షాళన దిశగా సర్కారు చర్యలు
- కృతిమ కొరతకు చెక్ పెట్టేందుకు కొత్త యాప్
- జిల్లాలో ఇప్పటికే 212 ఎరువుల దుకాణాల తనిఖీలు పూర్తి

జగిత్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కొరతను నివారించేం దుకు వ్యవసాయాధికారులు ఎరువుల నిల్వలపై ప్రత్యేక నిఘా పెడుతు న్నారు. ఎరువుల నిల్వలను కచ్చితంగా తెలుసుకునేందుకు వ్యవసాయ శాఖ ఫర్టిలైజర్ ఇన్వెంటరి వెరిఫికేషన్ (ఎఫ్ఐవి) పేరిట ప్రత్యేక యా ప్‌ను తీసుకొచ్చింది. జిల్లాలో ఈ విధానం అమలు చేయడానికి సంబం ధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జిల్లాలో యూరి యా, ఇతర ఎరువుల కొరతపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఎరువుల కొ రతకు కారణాలేంటనే దానిపై పరిశీలించి క్షేత్రస్థాయిలో లోపాలను గు ర్తించి మరింత పారదర్శకంగా వ్యవస్థ ఉండేలా చర్యలు చేపట్టింది. ప్ర త్యేక యాప్‌తో జిల్లాలోని ఎరువుల దుకాణాలను పరిశీలించి అక్రమ నిల్వలపై చర్యలు తీసుకుంటున్నారు.

● నిల్వలు ఒకలా.. యంత్రాల్లో మరోలా...

ఎరువుల విక్రయం మొత్తం పీవోఎస్ యంత్రాల ద్వారా చేయాలని ని బంధనలున్నా కొందరు డీలర్లు నిబంధనలను విస్మరిస్తున్నారు. పీవోఎస్ యంత్రాల్లో చూపించిన ఎరువుల నిల్వలు, భౌతిక నిల్వలకు మధ్య వ్యత్యా సాన్ని ఉన్నతాధికారులు గమనిస్తున్నారు. యంత్రాల్లో నిల్వలు భారీగా కనిపించడంతో సరిపడా ఎరువులు ఉన్నాయని భావించి కేంద్ర ప్రభుత్వం సరఫరా చేయడం లేదు. వాస్తవానికి భౌతికంగా ఎక్కడా నిల్వలు లేక పో వడంతో రైతులకు యూరియా కొరత కొన్ని ప్రాంతాల్లో కొద్దిగా తలెత్తింది. యూరియా కోసం రైతులు కష్టాలు, ఆందోళనలు పడకుండా ఉండేందుకు ఈ యాప్‌ను అమల్లోకి తీసుకువచ్చింది.

● పంపిణీ పక్కదారి పట్టకుండా...

జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 36 ఆగ్రోస్ కేంద్రాలున్నాయి. వాస్తవా నికి మండలానికి రెండైనా దుకాణాలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో వీటిని ప్రోత్సహించారు. గతంలో అప్పటి ముఖ్య మంత్రి వైఎస్ఆర్ హయాంలో ఉన్న కేంద్రాలకు తోడు కొత్తవి విరివిగా మంజూరు చేశారు. అయితే ఎరువుల కేటాయింపులో సరియైన ప్రాధా న్యం దొరకకపోవడంతో కొన్ని కేంద్రాలు నామమాత్రంగా పనిచేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న దుకాణాల ద్వారా యువతకు నిజంగా ఉపాధి దొరుకు తోందా..?రైతులకు ఎంత వరకు పారదర్శకంగా సేవలందిస్తున్నారు..?అనే కోణంలో ప్రభుత్వం విచారణ చేస్తోంది. ఇంతకు ముందు ఎరువుల కే టాయింపుల్లో 60 శాతం మార్క్‌ఫెడ్‌కు, 20 ఆగ్రోస్ సేవా కేంద్రాలకు, 20 శాతం ప్రైవేటు డీలర్లకు ఇచ్చే వారు. మార్క్‌ఫెడ్ ద్వారా సొసైటీలకు పం పిణీ జరిగేది. కొన్ని సంఘాలు సక్రమంగా డబ్బులు కట్టకపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ పరిస్థితుల్లో ఆ ప్రాంతంలో ఉన్న రైతులు ఎరువుల కోసం ప్రయివేటు డీలర్లను ఆశ్రయించాల్సి వస్తోం ది. ఇప్పుడలాంటి పరిస్థితి సర్కారు దిద్దుబాటు చర్యలు చేపడుతోంది. అ గ్రోస్ కేంద్రాలకు గతంలో మాదిరిగా కేటాయింపులు ఇచ్చి, రవాణా రాయి తీలిస్తే రైతులకు సేవలు అందుతాయని బావిస్తోంది. ఆ దిశగా ప్రభుత్వం ముందుకు కదులుతోంది.

● వారంలో రెండు సార్లు తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా 355 ఎరువుల దుకాణాలున్నాయి. ఇందులో ఇప్పటి వరకు 212 దుకాణాల్లో నిల్వలను అధికారులు తనిఖీలు చేశారు. వివ రాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఈనెల 31వ తేదీ లోపు వివ రాల నమోదు పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటు న్నా రు. ప్రతి సోమ, గురువారాల్లో మండల వ్యవసాయాధికారి ఐదు, ఏడీఏ ఐదు, జిల్లా వ్యవసాయాధికారి నెలలో ఐదు దుకాణాలను తనిఖీ చేయా లి. ఎరువుల దుకాణంలో నిల్వల వివరాల ఫొటోలను యాప్‌లో నిక్షిప్తం చేయాలి. నిల్వల రికార్డుల్లో సంతకం పెట్టి ఫొటోలను మూడు రోజుల్లోగా అప్‌లోడ్ చేయాలి. పీవోఎస్ యంత్రాలు ఉపయోగిస్తున్నారా లేదా వివ రాలను సేకరించి డివిజన్ స్థాయిలో సహాయ సంచాలకులు తన పరిధిలో వారానికి రెండు రోజులు ఐదు దుకాణాలు తనిఖీ చేసి ఎరువుల వివరాలను యాప్‌లో నమోదు చేయించాలి. జిల్లాస్థాయిలో జిల్లా వ్యవసా యాధికారి వివరాలు సేకరించి అప్‌లోడ్ చేయాలి. ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం ఎరువుల దుకాణాల నిర్వహణ ఉందా...లేదా అనేది తని ఖీల ద్వారా తెలుస్తుంది. ఎరువుల విక్రయాల తీరును ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారికి మాత్రమే యాప్‌లోకి లాగిన్ అవకాశం ఉంటుంది. అందువల్ల దుకాణాలను వెళ్లిన అధికారులు పర్యవేక్షణ పకడ్బందీగా చేపట్టాల్సి ఉంటుంది.

● అక్రమ నిల్వలకు అడ్డుకట్ట

ఈ యాప్ ద్వారా ఎక్కడెక్కడ ఎన్ని నిల్వలు ఉన్నాయో కచ్చితమైన లెక్క ఉంటుంది. ఎక్కడ కొరత ఉందో అక్కడ సరఫరాను మెరుగుపరచ డానికి అవకాశం ఉంటుంది. దీనివల్ల రైతులకు ఎరువుల కొరత ఉండ దు. వానాకాలం, యాసంగి కాలంలో ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. డీఏపీ, యూరియాను విరివిగా వాడుతుంటారు. కొత్త యాప్ కారణంగా ప్రభుత్వం వద్ద ఎక్కడెక్కడ నిల్వల ఎంత ఉన్నాయో తెలు స్తుంది. కొరతను బట్టి సరఫరాను మెరుగుపరచడానికి అవకాశం ఉంది.

తనిఖీలు చేస్తున్నాం...

- డాక్టర్ సురేశ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి



జిల్లాలోని అన్ని దుకాణాలను యాప్ సహాయంతో తనిఖీ చేస్తున్నాం. యాప్ అందుబాటులోకి రావడంతో రైతులకు ఉపయోగకరంగా ఉంటుం ది. రాష్ట్రంలో ఎక్కడ నిల్వ ఉన్నా కొరత ఉన్న జిల్లాకు తెప్పించుకోవచ్చు. ఇప్పటికే జిల్లాలోని ఏవో, ఏడీఏలకు శిక్షణ ఇచ్చాం. జిల్లాలో ముప్పాతిక శాతం తనిఖీలు సైతం పూర్తి చేశాము.

ఘనంగా మల్లికార్జునస్వామి జాతరోత్సవం

● ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు



తాండ్ర్యాలలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కథలాపూర్, జనవరి 28 : మండలంలోని తాండ్ర్యాలలో ఆదివారం మల్లికా ర్జునస్వామి జాతర ఘనంగా జరిగింది. గుట్టపై కొలువైన స్వామి వారి సన్నిధి కి వందలాది మంది భక్తులు స్వామి దర్శనం కోసం బారులు తీరారు. ఉద యం నుంచి సాయంత్రం దాకా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మల్లికా ర్జున స్వామితో మేడలాంబ, కేతలాంబ కళ్యాణం కమనీయంగా జరిగింది. క ల్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. వేములవాడ ఎమ్మెల్యే కల్యాణంలో పాల్గొనగా అర్చకులు పూర్ణకుం భంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూ జల్లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్థులు శాలువాతో స న్మానిం చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గడీల గంగప్రసాద్, పీసీసీ కార్యవర్గ సభ్యు డు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాం గ్రెస్ అధ్యక్షుడు అజీం, రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి పులి హరి ప్రసాద్, ఉరుమల్ల చారి, సత్యనారాయణ, గంగాదర్, గ్రామస్థులు ఉన్నారు.

కొండగట్టులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కొండగట్టులో సమావేశమైన పూర్వ విద్యార్థులు

మల్యాల, జనవరి 28: మల్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు దశా బ్దాల క్రితం(1989) పదవ తరగతి చదువుకున్న అప్పటి విద్యార్థులు ఆదివా రం కొండగట్టులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. వివిధ రంగా లలో స్థిరపడిన వారంత ఈ సందర్భంగా తమ బాల్యం, విద్యార్థి దశ గుర్తు లను నెమరువేసుకున్నారు. అప్పటి విద్యార్థులు అందరూ ట్రస్ట్ ఏర్పాటు ద్వా రా సామాజిక సేవలు చేయాలని నిర్ణయించారు. అంతే కాకుండా తోటి పేద మిత్రులను ఆదుకోవాలని కూడా తీర్మానించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయు లను గుర్తు చేసుకున్నారు. మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో దూడం శ్రీశైలం, బింగి వేణు, ప్రతాప్ నాగేశ్వర్‌రావు, గాండ్ల ఆం జనేయులు, జనగాం వెంకటేశం, చేపూరి మల్లేశం, వెంకటేశం, షాకీర్, ఒల్లాల మల్లేశంగౌడ్, జమున, గోదావరి, గంగజమున, సరస్వతి, మాలతి పాల్గొన్నారు

మహిళలకు కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయలక్ష్మి



మాట్లాడుతున్న విజయలక్ష్మి

జగిత్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బేషరతుగా కేటీఆర్ మహిళ లకు క్షమాపణ చెప్పాలని జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటిపర్తి విజయ లక్ష్మీ అన్నారు. ఆదివారం పట్ట ణంలో ఏర్పాటు చేసిన విలేకరుల స మావేశంలో ఆమే మాట్లాడారు. మహా లక్ష్మీ పథకం అమలులో భాగంగా ప్రా రంభించిన ఫ్రీ బస్ పథంకపై మహి ళల్లో వస్తున్నా ఆదరణ చూసి ఓర్వలే క మాజీ మంత్రి కేటీఆర్ అనసవర విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నిర్వహిం చిన ఓ సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్ ఫ్రీ బస్ ప థకం ఓ దిక్కుమాలిన పథకం అంటూ మాట్లాడడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ఫ్రీబస్ పథకంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ మహి ళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అంజన్న సేవలో అథ్లెటిక్స్ కోచ్

మల్యాల, జనవరి 28: ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ఇండియన్ అథ్లెటిక్ కోచ్ నాగపూరి రమేష్ సతీసమేతంగా ఆదివారం కొండగట్టు అంజనేయ స్వా మిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. వారి వెంట గౌతం రెడ్డి, మహిపాల్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

రాయికల్, జనవరి 28: మండలంలోని ఇటిక్యాల గ్రా మానికి చెందిన రుద్రవేణి నర్సయ్యకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సహకారంతో వచ్చిన రూ.25,500 విలువ గల సీఎం ఆర్ఎఫ్ చెక్కును ఆదివారం ఎంపీటీసీ కొమ్ముల రాధఆది రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు గంగాధర్, బుల్లెట్ రాజరెడ్డి, శ్రీనివాస్, నారాయణరెడ్డి, బొ ద్దం అంజిరెడ్డి, రాజరెడ్డి, విష్ణు, సాయి పాల్గొన్నారు.

మున్నూరు కాపు కల్యాణ మండప నిర్మాణానికి కృషి

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి

జగిత్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ము న్నూరు కాపు కల్యాణ మండప నిర్మాణానికి అవసరమై న సహకారాలు అందిస్తానని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఇందిరా భవన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని పలువురు మున్నూరు కాపులు కలి సి సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ము న్నూరు కాపు సంఘ కల్యాణ మండప నిర్మాణానికి రూ. 20 లక్షలు మంజూరు చేస్తానని హామీనిచ్చారు. పలువు రు మున్నూరు కాపు సంఘం నాయ కులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై ఫిర్యాదు

కోనరావుపేట, జనవరి 28 : కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామం లోని రేషన్ డీలర్ వంశీకృష్ణరావుపై అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జవ్వాజీ తిరుప తి గౌడ్ జిల్లా పౌరసరపారాల శాఖ అధికారికి ఫిర్యాదు చే యనున్నట్లు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ మర్తనపేట గ్రామ సర్పంచ్‌గా వంశీ కృష్ణరావు కొనసాగుతూ ప్రభుత్వ రేషన్ డీలర్‌గా కూడా కొనసాగుతూ ఇటు రేషన్ డీలర్ కమిషన్, అటు సర్పంచ్ గౌరవ వేతనం పొందుతూ ప్రభుత్వాన్ని మోసం చేస్తు న్నాడని అన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థిక సహాయం అందజేత

సుల్తానాబాద్, జనవరి 28 : సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామానికి చెందిన తంగళ్ల చెంద్రయ్య హమాలీ కార్మికుడు ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో మరణించాడు. వారి కుటుంబానికి. రేగడిమద్దికుంటకు చెందిన ఎంపీటీసీ గడ్డం రాజమణి, సుద్దాల సింగల్‌విండో అధ్యక్షుడు గడ్డం మహిపాల్‌రెడ్డిలు రూ.5000 వేల రూపాయల ఆర్థికస హాయం ఆదివారం కుటుంబ సభ్యులకు అందించారు.

ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తాం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



గోవింద్‌పల్లె గ్రామంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అడ్లూరి

ధర్మపురి, జనవరి 28: ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యా రెంటీ పథకాలను పక్కాగా అమలు చేస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో రూ 20 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన గ్రామపంచాయితీ కార్యాలయం నూతన భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పా టు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణ్‌కుమార్ మాట్లాడు తూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చడం కో సం ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రెండు గ్యారెంటీ పథకా లు అమలు చేయగా మిగతా వాటిని నూటికి నూరు శాతం అమలు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉండగా ప్రజా సంక్షేమం దృష్టిలో పె ట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలు ప్రజలకు దరి చేరుస్తారని ఆయన అన్నారు. నేరెళ్ల-గోవింద్‌పల్లె గ్రామాలకు చెందిన సమస్యలు తన దృష్టికి తీసుకు రావాలని ఆయన కోరారు. ఇక్కడ నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు ప్రభుత్వ విప్, ఎమ్మె ల్యే లక్ష్మణ్‌కుమార్‌కు గ్రామపంచాయితీ పక్షాన సర్పంచ్ పురంశెట్టి రాజయ్య, వా ర్డు సభ్యులు స్వాగతం పలికి శాలువా కప్పి సన్మానించారు. సర్పంచ్ పురంశెట్టి రాజయ్యను నూతన పంచాయితీ భవనంలో గ్రామస్థులు శాలువా కప్పి సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఎంపీపీ ఎడ్ల చిట్టి బాబు, జడ్పీటీసీ బత్తిని అరుణ, సర్పంచ్ పురంశెట్టి రాజయ్య. ఎంపీటీసీ రెడ్డవేని సత్యం, టీపీసీసీ సభ్యు లు సంగనభట్ల దినేష్, కాంగ్రెస్ మండల అధికార ప్రతినిధి జాజాల రమేష్ ఉప సర్పంచ్ జీల్ల మల్లయ్య, పంచాయితీ కార్యదర్శి మన్సూర్, వార్డు సభ్యులు పురం శెట్టి మల్లేశం, వార్డు సభ్యులు రాజయ్య, రాజేశం, నర్సయ్య, రజిత, రాజేశ్వరీ, మ మత, కో ఆప్షన్ సభ్యులు మల్లేశం, లచ్చయ్య, వినయ, గ్రామస్థులు పాల్గొన్నారు. చివరగా నేరెళ్ల గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు చేశా రు. ఆలయ అలవృద్ధి కమిటీ సభ్యులు బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఆయనకు వినతి పత్రాన్ని అందించారు.

కారోబార్‌లను సహాయ కార్యదర్శులు నియమించాలి

గ్రామపంచాయితీ కార్యాలయాల్లో పని చేస్తున్న కారోబార్, బిల్ కలెక్టర్‌లను 51 జీవో మల్టిపర్పస్ విధానం నుంచి మినహాయించి సహాయ కార్యదర్శిగా నియ మించాలని కోరుతూ టీజీ గ్రామపంచాయితీ కారోబార్స్ అండ్ సిబ్బంది యూ నియన్ నాయకులు కోరారు. ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో గల క్యాంపు కా ర్యాలయంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆదివా రం ఆ సంఘం నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ జీవో వల్ల కారోబార్స్, బిల్ కలెక్టర్లు మానసిక క్షోభ ను అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కారోబార్స్, బిల్ కలెక్టర్లు డిగ్రీ, పీ జీ చేసి ఉన్నారని, రికార్డులు నిర్వహణ చేయాల్సి ఉన్న వారందరికి అన్యాయం జరిగిందని తెలిపారు. వెంటనే గత 2019 అక్టోబరుకు ముందు ఉన్న కారోబార్స్, బిల్ కలెక్టర్లు అందరికి మల్టిపర్పస్ నుంచి మినహాయింపు ఇచ్చి సహాయ కార్య దర్శులుగా నియమించాలని కోరారు.

అంతర్గాం జీపీ కి రూ. 25 లక్షల నిధులు మంజూరు

జగిత్యాలరూరల్, జనవరి 28 : జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామపం చా యతీ భవన నిర్మాణానికి రూ. 25 లక్షలు నిధులను మంజూరు చేస్తూ కలెక్టర్ షేక్ యాస్మి న్ బాషా ఉత్తర్వులను జారీ చేశారు.

జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థకు చే రిందని, నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని కోరు తూ ఈనెల 25న నీటిపారుదల, పౌరసరాఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి అంతర్గాం గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సర్పంచ్‌పై తప్పుడు కేసు పెట్టి జైలుకు పంపడం బాధాకరం

జగిత్యాలరూరల్, జనవరి 28 : జగిత్యాల రూరల్ మండలం లోని హబ్సీపూర్ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టి జై లుకు పంపడం బాధాకరమని జగిత్యాల అర్బన్, రూరల్ మండ లాల సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సర్పంచులు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ 3 దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చిన్నపాటి సర్పంచ్ పై కక్ష్యపూరిత దోరణితో వ్యవహరించడం తగదన్నారు. గ్రామంలో విచారించి వాస్తవాలను తెలుసుకోవాలని సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్సీని కోరారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం ఎన్నికలు

జగిత్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బండారి గార్డెన్స్‌లో ఆదివారం లైఫ్ ఇన్సూరెన్స్ ఏజంట్స్ సమాఖ్య జగిత్యాల శాఖ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో అధ్యక్షుడిగా వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా నర్సయ్య ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకా రం జరిపింది. ఈకార్యక్రమంలో సంఘ నాయకులు ప్రభాకర్, రా జయ్య, రంగారావు, వెంకటేశ్వర్లు, పలువురు ఏజంట్లు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలను పునరుద్ధరించాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 28 : నిలిచి పోయిన పొదుపు సం ఘా లను పునరుద్ధరించాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అ ధ్యక్షుడు మంగళారపు రాజేందర్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల ప ట్టణం గాంధీనగర్‌లో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో దివ్యాంగుల పొదుపు సంఘాలు నడుస్తున్నా యని అన్నారు. కొత్త సంఘాలను ఏర్పాటు చేస్తూ నిలిచిపోయిన పొదు పు సంఘాలకు గల కారణాలను గుర్తించి అధికారులు వా టిని పునరుద్ధరించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా దివ్యాం గుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, ఉపా ధ్యక్షుడు యెల్లె హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి మామిడాల నరేష్, నాయకులు బొద్దుల రవి, ఎండీ ఖాదర్, సంధ్య, లత, రమేష్, రాములు, నాగభూషణం, శ్రీనివాస్, రమేష్, మన్మోహన్, రాజు, దివ్యాంగులు పాల్గొన్నారు.

రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమా నికి అవసరమైన కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కు మార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎల్‌జీ గార్డెన్స్‌లో జరిగిన జిల్లా రి టైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడారు. రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాల్సిన అవసరముందన్నారు.

రేషన్ కార్డు జారీకి కృషి

రిటైర్డు ఆర్టీసీ ఉద్యోగులకు రేషన్ కార్డులు కల్పించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరింపజేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకా లు అన్ని వర్తింపజేసేలా ప్రయత్నాలు చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు ఒరుగంటి రమణారావు, ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగ సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు పర్యటన వాయిదా

పట్టణంలో ఈనెల 29వ తేదీన నిర్వహించతలపెట్టిన మాజీ మంత్రి హరీ శ్‌రావు పర్యటన వాయిదా పడిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. అని వార్య కారణాల వల్ల మాజీ మంత్రి హరీశ్ రావు హాజరుకావాల్సిన బీఆర్ఎస్ నిజామాబాద్ పార్లమెంట్ స్థాయి సన్నాహక సమావేశాన్ని వాయిదా వేసిన ట్లు తెలిపారు. హరీశ్‌రావు పర్యటన షెడ్యూల్‌ను తదుపరి ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దు

మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణానికి చెందిన ప్రదీప్ దర్శకత్వంలో మత్తు పదార్థాలను తీసుకోవడం వల్ల యువత బానిస కావడంపై రూపొందించిన షార్ట్ ఫిలం మత్తును యూ ట్యూబ్ ద్వారా ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో నాయకులు అ బ్దుల్ ఖాదర్, ముజాహిద్, నూర్‌బాషా, అజీజ్, రాజుకుమార్, సత్యం, గం గాదర్, చైతన్య, ప్రబాస్, క్రాంతి, ఆసీఫ్ పాల్గొన్నారు.

పేద వైష్ణవులను ఆదుకోవాలి

ఇల్లందకుంట, జనవరి 28: రాష్ట్రంలోని నిరుపేద శ్రీవైష్ణవులను ఆర్థికంగా ఆదుకోవాలని వైష్ణవ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు డింగరి రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం ఆవరణంలో ఆదివారం శ్రీవైష్ణవ సేవా సంఘం ఏర్పాటు చేసి 25ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా కరీంనగర్, పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డింగరి రవికుమార్ మాట్లాడుతూ శ్రీవైష్ణవి సేవా సంఘం పేద వైష్ణవులకు ఉపయోగపడే విధంగా ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో ఉన్న పేద వైష్ణవులకు ఆర్థిక, వైద్య, విద్య పరంగా ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. అందులో నిరుపేద వైష్ణవులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. .కార్యక్రమంలో డింగరి శ్రీధర్, సముద్రాల ప్రసాదచార్యులు, సముద్రాల సుదర్శనాచార్యులు, శేషం రామాచార్యులు, శేషం వంశీధరాచార్యులతో పాటు 350 మంది పాల్గొన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ స్థాయి సమావేశం

జమ్మికుంట రూరల్, జనవరి 28: జమ్మికుంట పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) హుజూరాబబాద్ నియోజక వర్గ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధానకార్యదర్శి అంకని బాను, పార్లమెంట్ ఇన్‌చార్జి దాసరి ఉష, రాష్ట్ర కార్యదర్శి దొడ్డె సమ్మయ్య, కన్వీనర్లు శిరీష, జన్ను స్వరూప, మిడిదొడ్డి స్వప్న హాజరయ్యారు. బీఎస్పీ అభ్యర్థులను పార్లమెంట్‌కు పంపేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని కార్యకర్తలు ప్రతిజ్ఞ చేశారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానంపై కార్యకర్తలకు వివరించారు. కార్యక్రమంలో మంద బాలన్న, మేకల రవీందర్, మారపల్లి మొగిలయ్య, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొనసాగుతున్న జనజాతర



స్వామి వారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు →

స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు →

- రాజన్న సన్నిధికి తరలివస్తున్న భక్తులు - గర్భాలయ ప్రవేశం నిలిపివేసిన అధికారులు

వేములవాడ, జనవరి 28: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజ రాజేశ్వర స్వామి వారి దేవస్థానం భక్తజనంతో కిటకిట లాడుతోంది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర తేదీ సమీపిస్తున్న క్రమంలో వేములవాడకు వేలాది మంది భక్తులు తరలివస్తున్నారు. దీంతో రాజన్న క్షేత్రంలో భక్తజన జాతర కొనసాగుతోంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి సుమారు 40 వేల మందికి పైగా భక్తులు తమ ఇష్టదైవమైన రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారు జామునే ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుం డంలో పవిత్ర స్నానాలు చేశారు. అనంతరం సర్వదర్శనం శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా మూడు రోజులుగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి స్వామివారి దర్శనం త్వరగా సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఫలితంగా భక్తులు నందీశ్వరుడు వద్ద నుంచి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్న పూజలు నిలిపివేయడంతో క్యూ లైన్లు వేగంగా కదిలాయి. శ్రీ స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపునకు సుమారు నాలుగు నుంచి ఐదు గంటల పైగా సమయం పడుతోంది. మరోవైపు బద్ది పోచమ్మ ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. వందలాది మంది భక్తులు తలపై బోనం పెట్టుకొని క్యూ లైన్లలో నిరీక్షించారు. తమ వంతు రాగానే ఆలయంలో చేరుకుని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఎన్టీపీసీ రిజర్వాయర్‌ను సందర్శించిన ఫిషరీస్ సొసైటీ



రిజర్వాయర్‌ని పరిశీలిస్తున్న బృందం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 28: రామగుండం ఎన్టీపీసీ జలాశయాన్ని ఆదివారం తెలంగాణ ఫిషరీస్ సొసైటీ బృందం సందర్శించింది. ఎన్టీపీసీ జలాశయంలో తేలియాడే సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ఇటీవల ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈనేపథ్యంలో సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుతో మత్యకారులపై ఎటువంటి ప్రభావం చూపే అవకాశం ఉన్నదనే అంశాన్ని పరిశీలించారు. సుమారు 900 ఎకరాల విస్తీర్ణంలో నెలకొల్పిన ఎన్టీపీసీ రిజర్వాయర్‌లో 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల తేలియాడే సౌరవిద్యుత్ కేంద్రం దాదాపు సగానికి పైగా జలాశయ విస్తీర్ణం అవసరం ఉంటుందని ఎన్టీపీసీ అధికారులు ఫిషరీస్ సొసైటీ బృందానికి వివరించారు. గతంలో జలాశయంలో చేపల వేటను కొనసాగించిన మత్స్యకారులను సోలార్ విద్యుత్ కేంద్ర ఏర్పాటు తర్వాత అనుమతించడం లేదని అధికారులు తెలిపారు. విద్యుత్ కేంద్ర ఏర్పాటు కారణంగా ఉపాధిని కోల్పోతున్నామని సమీప గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఫిషరీస్ సొసైటీ ప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. జలాశయంలో సౌర పలకల ఏర్పాటు చేయగా మిగిలిన విస్తీర్ణంలో తమకు చేపలు పట్టుకునే అవకాశం కల్పించే లా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లాలని వారు ఫిషరీస్ సొసైటీ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. జలాశయాన్ని పరిశీలించిన వారిలో తెలంగాణ ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల అధ్యక్షులు కనకయ్య, చంద్రశేఖర్‌తో పాటు ప్రతినిధులు ఉన్నారు.

రాజన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి

వేములవాడ, జనవరి 28: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి శ్రీసుధ దర్శించుకున్నారు. ఆదివారం నాడు కుటుంబ సమేతంగా స్వామి వారి దర్శనం కోసం వచ్చిన ఆమెకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జస్టిస్ స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వదించగా, ఆలయ ఏఈవో బి శ్రీనివాస్ ప్రసాదం అందజేశారు. జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, పట్టణ సీఐ కరుణాకర్ అంతకు ముందు ఆలయ గెస్ట్ హౌస్ వద్ద స్వాగతం పలికారు. ఆలయ ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు, ఆలయ పర్యవేక్షకుడు అల్లి శంకర్, ఇన్‌స్పెక్టర్ పవన్ అధికారులు వారి వెంట ఉన్నారు.



జస్టిస్ శ్రీసుధకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఏఈవో శ్రీనివాస్

వైభవంగా మల్లికార్జునస్వామి కల్యాణం

- ఎంపీ బండి సంజయ్ పూజలు



ఎంపీ బండి సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న ఆలయకమిటీ సభ్యులు

గన్నేరువరం, జనవరి 28: మండలంలోని మైలారం గ్రామంలోని శ్రీమల్లికార్జున స్వామి కల్యాణం, పెద్దపట్నాలు, జాతర ఉత్సవాలు ఆదివారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్వామివారిని దర్శించుకున్నారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెలించుకున్నారు. ఆలయకమిటీ దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్ర మంలో ఆలయకమిటీ చైర్మన్ వరాల పర్శరాములు, బీజేపీ మానకొండూరు నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి, జడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, బీజేపీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు నగునూరి శంకర్, గంప వెంకన్న, నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, తిప్పర్తి నిఖేష్, ఆలయకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలను దర్శించుకున్న ఎంపీ

మండలంలోని ఖాసింపేట మానసా దేవి ఆలయం, గన్నేరు వరంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, మైలారంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయాలను కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మైలారం, ఖాసింపేట ఆలయాలలో ఆయనకు గజమాలను వేసి, పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు ఏలేటి చంద్రారెడ్డి, బీజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పర్తి నిఖేష్, మచ్చ మురళి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి సహకరించాలి

- హైకోర్టు న్యాయమూర్తి పి శ్రీసుధ



జువైనల్ కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి పి శ్రీసుధ

కరీంనగర్ లీగల్, జనవరి 28: కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని హైకోర్టు న్యామూర్తి పి శ్రీసుధ అన్నారు. ఆదివారం కరీంనగర్ కోర్టు భవన సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐదవ అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (జువైనల్)కోర్టును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి వేణుగోపాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్య త్తులో బాల నేరస్తుల కేసులు లేని జిల్లాగా కరీంనగర్ ఏర్పడాలని ఆశిస్తున్నానన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇవి వేణుగోపాల్ మాట్లాడుతూ న్యాయవాదులు కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేస్తే సత్వర న్యాయం జరిగి దేశంలోనే కరీంనగర్ మొదటి స్థానంలో ఉండాలని కోరుకుంటున్నానన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ, మెజిస్ట్రేట్ సరళరేఖ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రఘునందన్‌రావు, మేజిస్ట్రేట్‌లు, ప్రభుత్వ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 36 ఆలయాల ధర్మకర్తల మండళ్లకు నోటిఫికేషన్

కరీంనగర్ కల్చరల్, జనవరి 28: దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని 36 ఆలయాల ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ అయింది. ఈ మేరకు రాష్ట్ర కమిషనర్ వి.అనిల్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ ఎ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కరీంనగర్ జిల్లాకు సంబంధించి విజయగణపతి సాయిబాబా దేవాలయం, పాతబజార్ గౌరీశంకరాలయం, మంకమ్మతోట భక్తాంజనేయస్వామి ఆలయం, జెడ్‌పి క్వార్టర్స్‌లోని వేంకటేశ్వర, అయ్యప్ప, శివ, ఆంజనేయస్వామి ఆలయాలు, ప్రొద్దుటూరి ట్రస్టు, భారత్ టాకీస్‌రోడ్ వీరాంజనేయస్వామి ఆలయం, మంకమ్మతోట వేంకటేశ్వరాలయం, ప్రశాంతనగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, రాంపూర్ గిద్దెపెరుమాళ్ల ఆలయం, కోతిరాంపూర్ పోచమ్మ ఆలయం, కట్టరాంపూర్ అభయాంజనేయస్వామి ఆలయం, గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, హుజూరాబాద్‌లోని హనుమాన్ ఆలయం, కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయం, తిమ్మాపూర్ నల్లగొండ సీతారామస్వామి ఆలయం, జమ్మికుంట వేంకటేశ్వరాలయం ఉన్నాయి. జగిత్యాల జిల్లాలోని శ్రీనివాస భవానీ ఆంజనేయ శంకరాలయం, బండ లింగాపూర్ గండి హనుమాన్ ఆలయం, మల్లన్నపేట మల్లికార్జునస్వామి ఆలయం, రాయికల్, కొత్తపేట రాజరాజేశ్వర నాగాలయం, పొలాస పౌలస్తీశ్వరాలయం, జగిత్యాల రాజరాజేశ్వరాలయం, రాయికల్ ఆంజనేయస్వామి ఆలయం, మెట్‌పల్లి లక్ష్మారెడ్డి ఛారిటబుల్ ట్రస్టు, మల్లాపూర్ గంగాగౌరీశ్వరస్వామి ఆలయం, కోరుట్ల వేంకటేశ్వరాలయం, కోటిలింగాల కోటేశ్వరాలయం, ఎరదండి మల్లికార్జున గంగామాత ఆలయం, సుందిళ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉన్నాయి. మంథని మహాలక్ష్మీ ఆలయం, లక్ష్మీనారాయణస్వామి ఆలయం, పెద్దాపూర్ యోగానంద లక్ష్మీనారసింహస్వామి ఆలయం, సిరిసిల్ల జిల్లాలోని లక్ష్మీవేంకటేశ్వరాలయం, శివసాయిబాబా ఆలయం, పోచమ్మ ఆలయం, విశ్వనాథ స్వామి ఆలయం ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని ఆసక్తి గల వారు ధర్మకర్తలుగా ఉండేదుకు తమ దరఖాస్తులను 20 రోజుల లోపు ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో గానీ, రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యాలయంలో గానీ సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి దేవాదాయ, పోలీసు శాఖల నుంచి వెరిఫికేషన్‌కు పంపిస్తారని, ఆ తర్వాత ఎంపికైన వారి లిస్టు రాష్ట్ర కమీషనరేట్ ద్వారా వస్తుందని తెలిపారు. అనంతరం ఎంపికైన వారితో పాలక వర్గ ప్రమాణ స్వీకారం చేయిస్తామని తెలిపారు.

విద్యుత్ బిల్లులు కాజేసిన కేసులో ఒకరి అరెస్టు

మానకొండూర్, జనవరి 28: మానకొండూర్‌లోని వెనుకబడిన తరగతుల సమీకృత హాస్టల్‌లో రూ. 31లక్షల విద్యుత్ బిల్లులను కాజేసిన కేసులో అప్పటి వార్డెన్ అన్నల దాసు లక్ష్మీనారాయణను సీఐ రాజ్‌కుమార్ అరెస్టు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మానకొండూర్‌లోని హాస్టల్ వార్డెన్‌గా 2018 నుంచి 2021 వరకు అన్నలదాసు లక్ష్మీనారాయణ విధుల్లో కొనసాగారు. హాస్టల్‌లోని 31లక్షల రూపాయల మేరకు విద్యుత్ బిల్లులను కాజేసాడని జిల్లా బీసీ వెల్ఫేరు అధికారి అనిల్‌కుమార్ అతడిపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈ నెల 19న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరుపాలని స్థానికులు కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మానకొండూర్, జనవరి 28: మండలంలోని లింగాపూర్ గ్రామ శివారులో ఆదివారం పేకాడుతున్న ఆరుగురిని కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. వారి నుంచి 14వేల రూపాయలు స్వాధీనం చేసుకొని మానకొండూర్ పోలీసులకు అప్పగించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

పెద్దపల్లి రూరల్, జనవరి 28: మండలంలోని పాలితం గ్రామ పంచాయతీ అనుబంధ పుట్టపల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తోకారం శ్రీనివాస్‌కు చెందిన పూరిగుడిసె దగ్ధమైంది. మంటలు చెలరేగుతుండటంతో స్థానికులు గమనించి మంటలను ఆర్పివేశారు. సంఘటన స్థలానికి ఫైర్ అధికారి దేవనంది శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంటలను పూర్తిగా ఆర్పేసి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ.50 వేల వరకు ఆస్తినష్టం జరిగి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

గంగపుత్రుల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలి



మాట్లాడుతున్న గంగపుత్రుల ఐక్య రాష్ట్ర అధ్యక్షుడు కావూరి వెంకటేష్

మెట్‌పల్లి, జనవరి, 28: రాష్ట్రంలోని గంగపుత్రుల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించాలని గంగపుత్రుల ఐక్య రాష్ట్ర అధ్యక్షుడు కావూరి వెంకటేష్ కోరారు. ఆదివారం పట్టణంలోని నరేంద్ర గార్డెన్‌లో నియోజక వర్గంలోని గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులో చెపలు పడుతున్న సమయంలో ప్రమాదవశాత్తు మరణించిన వారికి బీమా సౌకర్యం, 50 ఏండ్లుపై పడిన వారికి పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా డీఎఫ్‌సీఎస్ చైర్మన్ పల్లికొండ ప్రవీణ్ మాట్లాడుతూ జీవో 06 రద్దు చేయాలని, గంగపుత్రులకు ఉచిత వాహనాలు, చెరువుల అభివృద్ధి, చెపపిల్లలకు బధులుగా చెరువులో నాణ్యమైన చేపలను చెరువులో పెంచుకోవడానికి నగదును అందజేయాలనినియోజక వర్గంలో చేపల పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని, ప్రతి గ్రామంలో సంఘ భవనాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి నర్సింగరావు, కొమిరెడ్డి కరంచంద్ మాట్లాడుతూ గంగపుత్రుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్‌సీఎస్ డైరెక్టర్లు పర్రే శంకర్‌రాజు, ఎల్లా శ్రీనివాస్, పల్లికొండ భూమేష్, సముద్రాల రూప, శ్రీనివాస్, లచ్చయ్య, రాజయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు, గంగపుత్రులు పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో పడి మాజీ సర్పంచ్ మృతి

బీర్‌పూర్, జనవరి 28: మండలంలోని తాళ్లధర్మారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఏనుగు ఎల్లారెడ్డి(54) ఆదివారం ఉదయం తాను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్న పొలానికి నీరు పారించడం కోసం వెళ్లాడు. పొలానికి వెళ్లిన ఎల్లారెడ్డి ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పొలం వద్దకు వెళ్లి గమనించారు. అప్పటికే ఎల్లారెడ్డి వ్యవసాయ బావిలో పడి మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. ఎల్లారెడ్డి కుమారుడు మహేందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ గజేంధర్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిలు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మాజీ ఎమ్మెల్యే బిల్లులు రాకుండా అడ్డుకున్నారు

- గునుకుల కొండాపూర్ సర్పంచ్ భర్త లింగంపల్లి బాలరాజు ఆవేదన



లింగంపల్లి బాలరాజు

గన్నేరువరం, జనవరి 28: మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తమను నాలుగేళ్లుగా మానసికంగా వేధించి, బిల్లులు రాకుండా అడ్డుకున్నారని మండలంలోని గునుకుల కొండాపూర్ సర్పంచ్ భర్త లింగంపల్లి బాలరాజు సెల్ఫీ వీడియోను విడుదల చేసి మండల సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. తాము ఆర్థికంగా నష్టపోవడంతో ఉన్న 30 గుంటల భూమిని అమ్ముకుని కరీంనగర్‌కు పోయి కులవృత్తి చేసుకుంటూ పొట్టపోసుకుంటున్నామని చెప్పారు. తమ ఉసురు అతడికి తగులుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వీడియో వాట్సప్ గ్రూపుల్లో వైరల్ కావడంతో మండల వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

- ● ఐదు సార్లు తలనీలాల టెండర్లు వాయిదా
- ● మరో సారి 1న నిర్వహణకు ఏర్పాట్లు
- ● ఆరు నెలలుగా దేవస్థానం తరుపున సేకరణ



కొండగట్టు అంజన్న ఆలయం



తలనీలాలు తీస్తున్న సిబ్బంది

మల్యాల, జనవరి 28: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పరిధి లో భక్తులు సమర్పించే తలనీలాలకు టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. గతంలో జీఎస్టీ నెపం, ప్రస్తుతం మార్కెట్‌లో కురులకు ధ రలు పడిపోయాయని పేర్కొంటూ తలనీలాలు సేకరించే కాంట్రాక్టర్ టెం డర్లలో పాల్గొనడం లేదు. నెల రోజులుగా దేవస్థానం అధికారులు అయిదు సార్లు టెండర్లు ఆహ్వానించగా టెండర్లు దాఖలు కాలేదు. క్రితం సారి దానిలో ఒక్కరు మాత్రమే టెండర్ దాఖలు చేయగా దాన్నీ రద్దు చేసిన అధి కారులు మరో సారి ఫిబ్రవరి 1న ఆరవ సారి టెండర్ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. అంజన్న భక్తులు తమ మొక్కుల రూపేణ తలనీలాలు స్వామి వారికి సమర్పించడం ఆనవాయితీ కాగ వాటిని సేకరించడానికి దే వస్థానం తరుపున టెండర్లు నిర్వహించి వాటి సేకరణ వ్యాపారులకు అప్పగిస్తుంటారు. నాలుగేళ్లగా జీఎస్టీని వ్యాపారులకు అంటగ ట్టడంతో సేకరణపై సందిగ్ధం ఏర్పడింది. హెచ్చు పాట దారు తన టెండర్ ధరలపై జీఎస్టీ చెల్లించాలనే నిబంధనలు కురుల సేకరణపై ప్రభావం పడ్డాయి. దీంతో వ్యాపారులు టెండర్లకు ముందుకు రాక పోగా ఇప్పుడు అంతర్జా తీయ మార్కెట్‌లో కురులకు ధరలు పడిపోయాయని కాంట్రాక్టర్లు టెండర్లకు రావడం లేదు. దీంతో తలనీలాల సేకరణ దేవస్థానం అధికారుల పై నే పడింది. ఆరు నెలలుగా సిబ్బంది వాటిని సేకరిస్తుండగా వాటిని భద్ర పరచడం ఇబ్బందిగా మారింది.

● అప్పుడు జీఎస్టీ.. ఇప్పుడు ధరల లేమి..

తలనీలాల సేకరణపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ అమలు చేయాలనే ఆదే శాల నేపథ్యంలో జీఎస్టీ నిబంధనలతో వ్యాపారులు టెండర్లలో పాల్గొనడం లేదు. అయితే హెచ్చు పాటదారుకు టెండర్ సొమ్ములపై జీఎస్టీ విధించి చెల్లించాలనే నిబంధనలపై ఓ వ్యాపారి జీఎస్టీ కింద చెల్లించాల్సిన సొమ్ములు చెల్లించకుండా న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఇప్పుడది కోర్టు పరిధి లో ఉండడంతో మరో వ్యాపారి తన టెండర్ కాల పరిమితి ముగిసినప్పటికీ జీఎస్టీ కింద చెల్లించాల్సి సొమ్ములు బకాయిలు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. జీఎస్టీని మినహాయిస్తేనే టెండర్‌లో పాల్గొంటామని పేర్కొన్న కాంట్రాక్టర్లు తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో కురుల ధరలు పడిపోయాయని ధరలు తగ్గిస్తేనే టెండర్లకు ముందుకు వస్తామని అంటున్నారు. ఇందులో భాగంగా జూలైలో తలనీలాలకు దేవస్థానం అధికారులు టెండర్లు పిలవగా వ్యాపారులు ముందుకు రాలేదు. అప్పటి నుంచి శుక్ర వారం వరకు దేవస్థానం అధికారులు ఐదు సార్లు టెండర్లు నిర్వహించారు. కంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో వాయిదా వేసుకుంటూ వెలుతున్నారు.

● క్రితం సారి..

క్రితం సారి ఏడాది కాలపరిమితికి గాను రూ.3.65కోట్లు కాగా దేవస్థా నం అధికారులు ప్రతి ఏటా పది శాతం పెంపుతో టెండర్లు నిర్వహిస్తుం టారు. జీఎస్టీ, ధరల లేమితో కాంట్రాక్టర్లు టెండర్లకు ముందుకు రాకపోవ డంతో టెండర్ సొమ్ములను తగ్గిస్తారా అనేది దేవాదాయ శాఖ అధికారు లు తేల్చాల్సి ఉంది. దేవస్థానం అధికారులు ఇప్పటి వరకు అయిదు సార్లు వేలంకు షెడ్యూల్ జారీ చేశారు. నాలుగు సార్లు ఎవరూ పాల్గొనగకపోగా రెండు రోజుల క్రితం ముగిసిన దానికి మాత్రం ఒక్కరు పాల్గొన్నారు. దీం తో అది రద్దు చేయాల్సి వచ్చింది. మళ్లీ గురువారం నిర్వహించడానికి అధి కారులు సన్నాహాలు చేస్తున్నారు.

కమిషనర్‌కు నివేదిస్తాం..



కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొనకపోవడంపై కమిషనర్ దృష్టికి తీసు కెళ్లాము. మార్కెట్‌లో ధరలు లేవని వ్యాపార సంస్థలు వెనుకంజ వేస్తున్న ట్లు తెలుస్తోంది. మరో సారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళుతాం. తలనీ లాల టెండర్‌కు అధికారుల ఆదేశాల మేరకు నడుచుకుంటాం. టెండర్‌లో పాల్గొంటే వారి అభిప్రాయాలను కమిషనర్‌కు నివేదించే అవకాశం ఉంటుంది.

- పి వెంకటేష్, ఈవో

● తమ వాదనలు చెప్పకుండా, టెండర్లకు దూరం

అయితే కాంట్రాక్టర్లు తాము ఏ కారణం చేత టెండర్‌కు దూరంగా ఉం టున్నారో చెప్పాల్సి ఉండగా టెండర్‌లో పాల్గొనకపోవడం దేవస్థానం అధి కారులకు కూడా తలనొప్పిగా మారింది. టెండరులో పాల్గొని జీఎస్టీ కాని మార్కెట్‌లో ధరలు లేవని తేల్చి చెబితే దాన్ని దేవస్థానం అధికారులు దే వాదాయ శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లె అవకాశం ఉంది. గతంలోనూ పలు మార్లు నిర్వహించిన టెండర్‌లో తక్కువకు పాట పాడితే కమిషనర్ కు తెలిపి తగ్గించి అప్పగించిన దాఖలాలు ఉండగా ఇప్పుడు కూడా కాం ట్రాక్టర్లు టెండర్‌లో పాల్గొంటే తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

● దేవస్థానం తరుపున సేకరణ

తలనీలాల టెండర్ గత జూలైతో ముగియగా అంతకు ముందే నిర్వహించిన టెండర్‌లో వ్యాపార సంస్థలు పాల్గొనకపోవడంతో దేవస్థానం త రుపున అధికారులు తలనీలాలు సేకరిస్తున్నారు. ఆగస్టు నుంచి దేవస్థా నం సిబ్బందే వాటిని సేకరిస్తూ భద్రపరుస్తున్నారు. ఇది అధికారులకు ఇ బ్బందికరంగా పరిణమించింది. సేకరించిన తలానీలాల నిల్వలు పెరిగిపో తుండగా ప్రస్తుతం సేకరిస్తున్న తలనీలాలను టెండర్ అయ్యాక సదరు వ్యాపారికి అప్పగించేందుకు అధికారులు నిర్ణయించారు.

విద్యారంగానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వెంకట్

సిరిసిల్ల రూరల్, జనవరి 28: రాష్ట్రంలో విద్యారంగాన్ని కాపాడడంతో పాటు రాబోయే బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం అధికంగా నిధులను కేటాయించి విద్యారంగాన్ని పరిరక్షించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ వెంకట్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా స్థాయి విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి వెంకట్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల్లో విద్యారంగాన్ని పూర్తిగా ధ్వంసం చేసిందన్నారు. నూతనం గా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారం గాన్ని పరిరక్షించాలని కోరారు. రాబోయే బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తన భావజాలాన్ని ప్రజలపై రుద్దుతోందని, ప్రజల భావోద్వేగాలను రాజకీ యాలకు వాడుకుంటుందన్నారు. విద్యారంగాన్ని కాషాయీకరణ చేస్తోందన్నారు. భారత రాజ్యాంగ విలువలపై ప్రజలకు అవగహన కల్పించాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందే రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకోవాలన్నారు. వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, ఉపాధ్య క్షుడు అంబటి రమేష్, కోశాధికారి పర్కాల రవీం దర్, జిల్లా కార్యదర్శులు పాముల స్వామి, పోలాస మల్లేశం, కొత్వాల్ ప్రవీణ్, పాశం భాస్కర్, కొక్కుల బాలరాజు, తుమ్మనపెల్లి నరేష్, పసుల సత్యం పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఆర్టీసీ బస్సు అద్దాల ధ్వంసం

మల్యాల, జనవరి 28: మద్యం మత్తులో ఓ వ్యక్తి ఆర్టీసీ బస్సు అద్దాలను ధ్వంసం చేశాడు. దిగువ కొండగట్టు వద్ద జగిత్యాల వైపు వెలుతున్న ఆర్టీసీ బస్సు వెనుకాల అద్దాలపై ఆ వ్యక్తి బండరాయితో కొట్టడంతో అద్దం పగిలింది. ప్రయాణికులు తక్కువ ఉండడంతో ప్రమాదమేమి చోటుచేసుకోలేదు. అయితే అద్దానికి అయ్యే ఖర్చులు భరిస్తానని సదరు వ్యక్తి పేర్కొనడంతో ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేయకుండా వెళ్లిపోయినట్లు తెలిసింది.

ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

ధర్మపురి, జనవరి 28: ధర్మపురి మండల ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్ర లక్ష్మణ్ అధ్యక్షత వహించగా, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షులు దుమాల గంగారాం, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సూరుగు శ్రీనివాస్, ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరికిల్ల సతీష్ హాజరయ్యారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కమిటీ ఎన్నికల్లో భాగంగా ధర్మపురి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ధర్మపురి మండల కమిటీ అధ్యక్షులుగా చందోలి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పరపల్లి లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా కట్ట లక్ష్మణ్, సుద్దాల నరేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధికారి ప్రతినిధిగా జిల్లపల్లి గంగారాం, కార్యదర్శులుగా దూడ లక్ష్మణ్, మోతె ప్రభాకర్, కోశాధికారిగా కుంటాల శంకర్, ప్రచార కార్యదర్శిగా బరిగల ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా మేతరి గంగాధర్, సంయుక్త కార్యదర్శిగా మామిడిపల్లి గణేష్, మైలారం రవి, సాంస్కృతిక కార్యదర్శిగా జిల్లాపల్లి లింగన్న, గౌవర సభ్యులుగా అంతర్పుల దుబ్బయ్య, బొల్లారపు పోచయ్యను ఎన్నుకున్నారు.

వార సంతల నిర్మాణానికి ఉపాధిహామీ నిధులు

కొడిమ్యాల, జనవరి 28 : మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో బాగంగా గ్రామాలలో వార సంతల నిర్మాణానికి ఉపాధిహామీ, విలేజీ హాట్ నిర్మాణాలకు నిధులను ప్రభుత్వం అందించనున్నట్లు ఎంపీడీవో ప ద్మజారాణి, ఏపీవో సతీష్ తెలిపారు. మొదటి రకం వార సంతలో 30 గదులు, ఒక ఆఫీస్ రూం, మహిళలకు, పురుషులకు మరుగుదొడ్లు నిర్మించడానికి 10లక్షల రూపాయలను ఉపాధీ హామీ పథకం నుంచి , 5లక్షల రూపాయలను ఆసక్తి ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి డిపాజిట్ చేయాలిసి ఉంటుందన్నారు. ఈ సంత నిర్మాణానికి 6 నుంచి 8 గుంటల స్థల కావాల్సి ఉంటుందన్నారు. రెండవ రకం 20 గదులు, ఒక ఆఫీస్ రూం, మెన్స్ టాయిలెట్, నిర్మించుకోవాలనుకుంటే 9లక్షల రూపాయల ఉపాధిహామీ పథకం నుంచి విడుదల అవుతాయన్నారు. ఆసక్తి ఉన్న గ్రామ పంచాయతీ వారు 3లక్షల 25 వేలు రూపాయలను డిపాజిట్ చేయాల్సి ఉంటుందన్నారు.

ఈ విలేజీ హాట్ నిర్మాణానికి 5 నుంచి 6 గుంటల స్థలం కావాలిసి ఉంటుందన్నారు. ప్రభుత్వ స్థలం విషయమై తహసీల్దార్‌కు సమాచారం అందించినట్లు తెలిపారు.

వైభవంగా మండలారాధన మహోత్సవం



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

కొడిమ్యాల, జనవరి 28 : మండల కేంద్రంలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ప్రాణ ప్రతిష్ఠ జరిగి 41 రోజులు పూర్తియిన (మండలం)సందర్భాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో ఆదివారం మండలారాధన మహోత్సవాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు, ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం, సుదర్శన హోమం కార్యక్రమాలను పండితులు జగన్నాథం విష్ణువర్దనాచార్యులు, ఆలయ పూజారి నాగరాజు రమేష్ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

ఏడాదిగా నిలిచిన వంట గది నిర్మాణం

●పట్టించుకోని అధికారగణం

●ఇబ్బందులు పడుతున్న వంట కార్మికులు



ఆరుబయట వంట చేస్తున్న కార్మికులు

కొడిమ్యాల, జనవరి 28 : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ పరిధిలో వంట గది నిర్మాణం సుమారు ఏడాదిగా నిలిచి పోయిన సంబంధిత అధికారులు ఎవ్వరు పట్టించుకోవటం లేదు. పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి మధ్యాహ్న బోజన వంట కార్మికులు ఎండలో ఎండుతూ, వర్షంలో తడుస్తూ ఆరు బయటనె వంట చేస్తు కాలం వెల్లదీస్తున్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ 4 లక్షల 95 వేల రూపాయలను వంట గది నిర్మాణానికి మంజూరు చేయగా స్లాబ్ లేవెల్ వరకు పనులు జరిగాయి. సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పట్టింపులేని తనంతో వంట గది నిర్మాణం పూర్తి కాలేదు. దీంతో మధ్యాహ్న భోజన కార్మికులు బయటనే వంట చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని వంట గది నిర్మాణం పూర్తి చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ బి. లావణ్య మాట్లాడుతూ మధ్యాహ్న బోజన వంట కార్మికుల ఇబ్బం దులను దృష్టిలో పెట్టుకొని వంట గది నిర్మాణం పూర్తి చేయించాలని సంబం దిత అధికారులను, కాంట్రాక్టర్‌ను కోరారు.

డిగ్రీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మెట్‌పల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

మెట్‌పల్లి, జనవరి, 28 : పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాలల్లో చదువుకున్న 2008-11 బీకాం విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఆదివారం పట్టణంలోని మనోహర్ గార్డెన్‌లో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించికుని చదువు చెప్పిన గురువులకు శాలువలతో సన్మానం చేశారు. పూర్వ విద్యార్థులు అంత ఒక్క చోట చేరుకొని ఒకరినొకరు యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చదువుకున్న సమయంలోని జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆట పాటలతో సంతోషంగా గడపారు. అనంతరం సహపక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో కారస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్, వైస్ ప్రినిపాల్ రాజ్, అధ్యాపకులు సాయి, నవీన్, గంగాధర్, కార్యక్రమం నిర్వహించిన వారు ముక్క నరేష్, అరుణ్, రవి, గోపి, రమేష్, శివ, అనిల్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ టికెట్ పెర్క శ్యామ్‌కు ఇవ్వాలి'

పెద్దపల్లిటౌన్, జనవరి 28: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా పెర్క శ్యామ్‌ను ప్రకటిస్తే మద్దతుగా ఉంటామని తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు ఆదివారం ప్రకటించారు. పెద్దపల్లి పార్లమెంట్ నాయకులు, టీపీసీసీ కార్యదర్శి పెర్క శ్యామ్ పెద్దపల్లి వైట్‌హౌస్‌లో తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. గ్రామీణ వైద్యులు కార్యదర్శి పెర్క శ్యామ్‌కు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గర్రె పెల్లి రాజేశం, జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షులు ముస్తఫా, కోశాధికారి మంద భాస్కర్ యాదవ్, అధికార ప్రతినిధి చిపకుర్తి శంకర్, వైస్ ప్రెసిడెంట్ బొమ్మెన వెంకన్న, మంథని డివిజన్ అధ్యక్షులు బొద్దుల జగన్, జిల్లా వైస్ ప్రెసి డెంట్ జనగామ రవి, జిల్లా కార్యదర్శి సీపెల్లి రవీందర్, కృష్ణమాచారి పాల్గొన్నారు.

రక్తహీనతకు చెక్ పెట్టేలా..

● 'ఎనీమియా ముక్త్ తెలంగాణ'కు కసరత్తులు ● జిల్లాలో జోరుగా హెచ్‌బీ స్క్రీనింగ్ టెస్టులు

● ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో 10 ప్రత్యేక బృందాలు

జగిత్యాల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కౌమార దశలోని బాల బాలికల్లో రక్తహీనతను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. ఇందులో భాగంగా 'ఎనిమియా ముక్త్ తెలంగాణ' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు ఈనెల తొలివారం నుంచి రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో రక్త హీనతతో ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు చదువుపై శ్రద్ధ తగ్గుతుందనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ రక్త పరీక్షలను ప్రారంభించింది. వైద్య పరీక్షల ద్వారా రక్తస్థాయిని తెలుసుకొని అవసరమైన వైద్యం అందించడానికి ప్రయత్నిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో జోరుగా రక్త పరీక్షలను నిర్వహిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా విద్యార్థినుల సంఖ్య

జిల్లా వ్యాప్తంగా 27,644 మంది విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ ముందుకు వెళ్తోంది. ఇందులో 8వ తరగతి విద్యార్థులు 8,362 మంది, 9వ తరగతి విద్యార్థులు 7,951 మంది, 10వ తరగతి విద్యార్థులు 7,516 మంది, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు 1,965 మంది, ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,850 మంది ఉన్నారు. జిల్లాలో హిమోగ్లోబిన్ రక్త పరీక్షకు అవసరమైన స్ట్రిప్స్ 27,700లను అధికారులు అందుబాటులో ఉంచారు.

10 ప్రత్యేక బృందాలు..

జిల్లాలో ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో రక్త పరీక్షలు నిర్వహించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. రాష్ట్రీయ బాల స్వస్త్, రాష్ట్రీయ కిశోర్ స్వస్త్ ద్వారా మూడు నియోజక వర్గాల్లో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందాలు ప్రతీ రోజు పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ఒక్కో బృందం వంద మందికి రక్త పరీక్షలు నిర్వహిస్తుంది. ఈ బృందంలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు, ఒక ఫార్మాసిస్టు, ఒక ఏఎన్ఎం ఉంటున్నారు. సిబ్బంది కొరత ఉన్న ప్రాంతాల్లో ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ఫార్మాసిస్టు, ఒక ఏఎన్ఎంలను ఏర్పాటు చేశారు. డిజిటల్ మిషనరీలతో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. పిల్లల్లో హిమోగ్లోబిన్ 8 శాతం ఉంటే సాధారణ స్థాయిగా గుర్తిస్తారు. 8 శాతం కంటే తక్కువగా నమోదు అయితే రక్తహీనతగా గుర్తిస్తారు. హిమోగ్లోబిన్ శాతం 6,7గా నమోదైన విద్యార్థులకు మల్టీ విటమిన్, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మందులను అందజేస్తారు. అదేవిధంగా తీవ్రత ఎక్కువగా ఉంటే ఆసుపత్రులకు రెఫర్ చేసి రక్తం ఎక్కించడం, క్యాన్సర్, తలసేమియా, రక్త హీనత, సికిల్ సెల్ పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

నెలాఖరుతో ముగిసేలా...

జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థినులకు రక్త పరీక్షలు చేస్తున్నారు. వీటితో మోడల్ పాఠశాలలు, కేజీబీవీలు, సంక్షేమ వసతి గృహాలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఈ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకునే 8వ తరగతి నుంచి ఇంటర్ స్థాయిలో ఉన్న విద్యార్థుల సంఖ్యను అధికారులు గుర్తించారు. ఆర్‌బీఎస్‌కే సిబ్బంది బృందాలుగా ఏర్పడి పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 10వ తేదీ నుంచి బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఇప్పటికే మెగా వైద్య శిబిరాలను నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేయడంతో పాటు సమీపంలోని ఆసుపత్రులకు రెఫర్ చేయడం వంటివి చేస్తున్నారు. ఆరోగ్యం, పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నెలాఖరుతో ముగించేలా ప్రయత్నాలు చేస్తున్నారు.



విద్యార్థినులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సద్వినియోగం చేసుకోవాలి

జగన్ మోహన్ రెడ్డి, జిల్లా విద్యాధికారి



జిల్లాలో ఎనిమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు జరుగుతున్నాయి. 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రక్త పరీక్షల ద్వారా రక్త హీనత, ఇతర అనారోగ్య సమస్యలు గు ర్తించే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లలను రక్త పరీక్షలు చేయిం చుకునేలా ప్రోత్సహించాలి.

రక్త పరీక్షలు చేయించుకోవాలి

డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో



విద్యార్థులు ఎలాంటి అపోహాలకు లోను కాకుండా రక్త పరీక్షలు చే యించుకునేందుకు ముందుకు రావాలి. రక్త హీనత కలిగిన విద్యార్థులను గుర్తించి మందులు పంపిణీ చేయడం, తీవ్రతను బట్టి ఆసుపత్రులకు రెఫర్ చేయడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వంటివి చేస్తున్నాము. కౌమార దశలో వచ్చే అనారోగ్య సమస్యలు అరికట్టేందుకు అవసర మైన చర్యలు తీసుకుంటున్నాము.

ఎలాంటి సమస్యలున్నా నేరుగా ఫోన్ చేయాలి

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్, జనవరి 28 :ప్రజలు ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనకే ఫోన్ చేయాలని, సమస్యలు లేని గ్రామాలుగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జగిత్యాల మండలంలోని అంబారిపేట, నర్సింగాపూర్, టీఆర్‌గర్ గ్రామాల్లో ఎమ్మెల్సీ పర్యటించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ మౌళిక వసతుల కల్పనే ధ్యేయంగా గ్రామాలను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. నర్సింగాపూర్ గ్రామంలో ఎస్సీ కాలనీల అభివృద్ధితో పాటుగా, ఇండ్ల నిర్మాణాల్లో ఎస్సీలకు ప్రాధాన్యతనిస్తామన్నారు. గ్రామాల్లోని మురికి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అంబారిపేట గ్రామంలో దేవాలయ అభివృద్ధికి కృషిచేస్తానని, ఆలయం వద్ద మూత్రశాలల నిర్మాణాలకు నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. టీఆర్‌నగర్‌లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ కొండా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు యువకులు, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఎమ్మెల్సీ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఐక్యతకు నిదర్శనం టీఆర్‌నగర్ అని అన్నారు. టీఆర్‌నగర్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానని, గ్రామ అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. ఇంటింటికి తాగునీరు, అందిస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరుగ్యారంటీలను అమలుచేస్తామని తెలిపారు. ఉగాది పండుగకు రేషన్‌కార్డులు జారీ చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధిగా జగిత్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీని కూల్చుతామని కొందరు వ్యక్తులు అంటున్నారని, కాంగ్రెస్‌ను కూల్చడం ఎవరితరం కాదన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జగిత్యాల రూరల్ మండలశాఖ అధ్యక్షుడు జున్ను రాజేందర్, జగిత్యాల ప్యాక్స్ వైస్ చైర్మన్ శీలం సురేందర్, నాయకులు సిరాజ్, రాజిరెడ్డి, రవి, శ్రీనివాస్, తిరుపతి, నరేష్, సురేందర్ పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి

ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తాం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న ఆది

కోనరావుపేట, జనవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తుందని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో ఆదివారం కృతజ్ఞత ర్యాలీలో పాల్గొన్నారు. గోవిందరావుపేట తండాలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి మహిళా కమ్యూనిటీ భవనానికి జడ్పీ చైర్‌పర్సన్ అరుణరాఘ వరెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాలు బాగుంటే రాష్ట్రాలు, దేశాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని అన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయాలు సంక్షేమ పథకాలు అమలుకు ప్రభుత్వానికి ప్రజల మధ్యలో వారధిగా ఉంటాయని అన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని అన్నారు. ఆరోగ్యశ్రీని ఐదు లక్షల నుంచి 10 లక్షల వరకు పెంచామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. అనంతరం మామిడిపల్లి శివాలయంలో 101 కొబ్బరికాయలు కొట్టి కార్యకర్తలతో కలిసి మొక్కును చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత, జగన్నాథ్, కొక్కుల భారతి, కాంగ్రెస్ జిల్లా నాయకులు జగన్మోహన్ రెడ్డి, కచ్చకాయల ఎల్లయ్య, చేపూరి గంగాధర్, చందనగిరి గోపాల్, గొట్టే రుక్మిణి, తాళ్లపల్లి ప్రభాకర్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, నందు గౌడ్, లింగారెడ్డి, కిషన్ రెడ్డి, కేతిరెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రకాష్ నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి బోనాలు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 28 : మండలంలోని రామలచ్చక్కపేట గ్రామంలోని మల్లికార్జున స్వామి బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని మల్లికార్జున స్వామిని భక్తులు ఉదయం నుంచి దర్శించుకున్నారు. భక్తులు భక్తి శ్రద్ధలతో బోనం తయారు చేసి నెత్తిన ఎత్తుకొని డప్పు చప్పుల మధ్య పోతు రాజుల విన్యాసాల నృత్యాలతో గ్రామ శివారులోని ఆలయానికి ఊరేగింపుగా బయలు దేరారు. ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



రామలచ్చక్కపేటలో బోనాలతో శోభాయాత్ర బయలుదేరిన భక్తులు

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల ద్వారా స్నేహ సంబంధాలు మెరుగు

ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి

ధర్మపురి, జనవరి 28: క్రీడల ద్వారా స్నేహ సంబంధాలు మెరుగుపడు తాయని ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో గోళ్ల కిషన్ స్మారక ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ కార్యక్రమానికి ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదానంలో క్రీడాకారులు గెలుపు-ఓట మి అనేది సమానంగా పరిగణించాలన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభ చాటి మరింత ముందుకు వెళ్లాలని ఆయన ఆకాంక్షించారు. క్రీడాకారులకు తన వంతు సహకారం ఉంటుందని ఆయన తెలిపారు. అంతకు ముందు జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వేములవాడ జట్టు (ప్రథమ), నేరెళ్ల జట్టు (ద్వితీయ) స్థానంలో నిలిచింది. ప్రథమ బహుమతిగా వేములవాడ జట్టుకు రూ 50,000, ద్వితీయ బహుమతిగా నేరెళ్ల జట్టుకు రూ 25,000, షీల్డును అతిథుల చేతుల మీదుగా అందించారు. టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, టోర్నమెంట్ నిర్వాహకులు రాందేని మారుతి, బొప్పు వెంకటేష్, పోత రాజుల వెంక టేష్, మండల ఎంపీటీసీల ఫోరం కన్వీనర్ రెడ్డవేని సత్యం, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రాందేని మొగిలి, కమలాకర్, శరత్, దేవవరం, శ్రీకాంత్, రామన్న, వేములవాడ, నేరెళ్ల క్రీడాకారులు పాల్గొన్నారు.



రన్నర్ జట్టుకు బహుమతి అందిస్తున్న సీఐ

అమ్మాయిలు ఆటల్లో మెరికలు..

●రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్న కండ్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు

జగిత్యాలరూరల్, జనవరి 28 : ప్రభుత్వ పాఠశాలలో చదువుతూనే విద్యార్థులు వివిధ క్రీడల్లో రాణిస్తూ అందరి దృష్టిని ఆకర్శిస్తున్నారు. పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరవుతున్న విద్యార్థులు మైదానంలో వివిధ ఆటలలో నిత్యసాధన చేస్తున్నారు. వ్యాయామ అధ్యాపకుల నుంచి మంచి చక్కటి శిక్షణ పొందుతున్నారు. పాఠశాలలో ఉన్న వసతులను సద్వినియోగం చేసుకుంటున్నారు. మండల, జిల్లాస్థాయిలోనే కాకుండా రాష్ట్ర, జాతీయస్థాయిలో విద్యార్థులు వివిధ క్రీడల్లో రాణిస్తున్నారు. పతకాలను కైవసం చేసుకుంటున్నారు. జగిత్యాల రూరల్ మం డలంలోని కండ్లపల్లి మోడల్‌పాఠశాల ఎనిమిదేళ్ల నుంచి క్రీడారంగంలో ఎన్నో విజయాలను సాధిస్తూ వస్తుంది. ఈ పాఠశాలలో చదువుచున్న పలువురు విద్యా ర్థులు జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయిలల్లో రాణిస్తూ ప్రతిభ కనబరుస్తున్నారు. వీరికి నిత్యం పాఠశాల ప్రిన్సిపల్ నాగసుధారాణి పర్యవేక్షణలో వ్యాయామ ఉపాధ్యాయులు వినీత్, అజీమ్ తోడ్పాడునందిస్తూ క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. ప్రతి నిత్యం మైదానంలో విద్యార్థులకు క్రీడల్లో మెళకువలు నేర్పిస్తూ మానసికంగా ధృడంగా తయారు చేస్తున్నారు.

విద్యార్థులు సాధించిన బహుమతులు..

2017 సంవత్సరంలో రాష్ట్రస్థాయి ఆదర్శపాఠశాల పోటీల్లో భాగంగా గొల్లపల్లి మండలకేంద్రంలోలో నిర్వహించిన పోటీల్లో పరుగుపందెంలో పి. విజయలక్ష్మీ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. టెన్నికాయిట్‌లో నవ్య అనే విద్యార్థి రాష్ట్రస్థాయిలో ఎంపికైంది. అలాగే 2017 సంవత్సరంలో నిర్వహించిన పోటీల్లో కె. రస్మిత బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే ప్రియచరిత బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రతిభకనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. 2020 లో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో పి. వాసవి ప్రతిభకనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికకాగా, 2023 లో కరాటే విభాగంలో రాష్ట్రస్థాయి పోటీల్లో శామంత్ అనే విద్యార్థి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనాడు. 2024లో జనగామలో జరిగిన జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో శాన్వి అనే విద్యార్థిని ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీల్లో ఎంపికైనట్లు పీడి వినీత్, అజీమ్‌లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి జాతీయస్థాయిల్లో రాణిస్తున్న గ్రామీణ విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ నాగసుధా రాణితో పాటు, పీడీ లు వినీత్, అజీమ్ లతోపాటు పలువురు అభినందించారు



పాఠశాల మైదానంలో ఆటలు ఆడుతున్న విద్యార్థినులు

రేపు జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీలు

సిరిసిల్ల టౌన్, జనవరి 28: రాజన్న సిరిసిల్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సిరిసిల్ల మినీ స్టేడియంలో జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ (పరుగు పందెలు)పోటీలు ఉంటాయని ఆదివారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు, ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. 8, 10, 12, 14, సంవత్సరాల బాలబాలికలకు ట్రాక్ అండ్ ఫీల్డ్ 50 మీటర్లు, 100, 300, 400, 600 మీటర్ల రన్నింగ్(పరుగు పందెలు)పోటీలు ఉంటాయని తెలిపారు. అదే విధంగా స్టాండింగ్ బ్రాడ్ జంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీలో విజేతలైన బాలబాలికలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో పాటు మెరిట్ సర్టిఫికెట్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పోటీలో ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించిన 25 మంది బాలబాలికలను ఎంపిక చేసి భద్రాది కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ అథ్లెటిక్స్ పోటీలకు పంపించడం జరుగుతుందని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనే బాలబాలికలు తహసీల్దార్ జారి చేసిన పుట్టిన రోజు ధృవీకరణతో రావాలని జిల్లా పరిధిలోని అన్ని మండలాల నుండి పోటీలలో బాలబాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాలని కోరారు. వివరాలకు సెల్ : 7901464456 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సిరిసిల్ల బల్దియాలో అవిశ్వాసం?

- కేటీఆర్ సమావేశానికి హాజరుకాని కౌన్సిలర్లు

సిరిసిల్ల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా సిరిసిల్ల మున్సిపాలిటీలో అవిశ్వాసం వైపు కదలికలు మొదలయినట్లు తెలుస్తోంది. సిరిసిల్లలో బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులతో ఆదివారం నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించా రు. దీనికి సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిలర్లు కొందరు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. కౌన్సిలర్లు 12 మంది వరకు క్యాంపునకు వెళ్లారనే ప్రచారం జోరందుకుంది. కొందరు మాత్రం చైర్‌పర్సన్ తీరును ని రసిస్తూ అవిశ్వాసం వైపు వెళ్లినట్లుగా చెప్పుకుంటున్నారు. బీఆర్‌ఎస్ నుంచి ఎవరిని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా తెరపైకి తెస్తారనే ఊహాగానాలు జోరందుకున్నాయి.

అవిశ్వాసం అవాస్తం

సిరిసిల్ల టౌన్, జనవరి 28: సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్‌పై అవిశ్వాసంపై సోషల్ మీడియాలో వస్తున్నన ది అవాస్తవం అని బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం బీఆర్ ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లా డా రు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇలాకాలో మున్సిపల్ చైర్‌పర్సన్‌పై 16 మంది కౌన్సిలర్ల అవిశ్వాసం అంటూ కొందరు సోషల్‌మీడియాలో వైరల్ చేస్తున్నార ని అన్నారు. సిరిసిల్ల నియోజకవర్గం సమావేశానికి 33 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లలో దాదాపు 24 మంది కౌన్సిలర్లు హాజరయ్యారన్నారు. ఆరుగురు కౌన్సిలర్లు వారి వ్యక్తిగత కారణాల వల్ల రాలేకపోయారని కేటీఆర్‌తో జరిగిన సమావేశంలో కౌన్సిలర్లు పాల్గొన్నారని అన్నారు. అవిశ్వాసం పెట్టడానికి క్యాంప్‌నకు వెళ్లారని వస్తున్న పుకార్లను ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు, కో అప్షన్‌సభ్యులు పాల్గొన్నారు.

వాహనాలకు నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలి

వీర్నపల్లి, జనవరి 28: ప్రతీ వాహనదారుడు వాహనాలకు నంబర్ ప్లేట్లను కలిగి ఉండాలని ఎస్సై రమేష్ అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి ప్రధాన రహదారిపై ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా నంబర్ ప్లేట్లు సరిగా లేని, ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు భద్రత నియ మాలు పాటించని వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ బాబు, సిబ్బంది రియాజ్, కార్తీక్ ఉన్నారు.

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

గంభీరావుపేట, జనవరి 28 : గంభీరావుపేట మండల కేంద్రంలోని మా అనాధ వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కామారెడ్డికి చెందిన డాక్టర్ మబ్లీ జన్మదిన సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, దాదాపు 70 వేలు విలువ చేసే మందులను ఉచితంగా అందజేశారు. వృద్ధులకు షుగర్ టెస్ట్, బీపి పరీక్షలు నిర్వహించారు.

అవసరమైన వారందరికి సరిపడు మందులను అందజేశారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, వృద్దులకు మందులను అందజేసిన కామారెడ్డి వైద్యులకు మా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మల్లుగారి నర్సాగౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.